బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

- సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ఆల


కొన్నూరులో సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొన్నూరులో గురువారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేశారు. అంతకుముందు మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ఎంపీటీసీ సభ్యుడు శరత్‌కుమార్ రెడ్డి రూ.1.50కోట్ల సొంత డబ్బులతో నిర్మిస్తున్న పాఠశాల భవనానికి భూమిపూజ చేసి పరిశీలించారు. అనంతరం రూ.12 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు, బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేయడంతో పాటు మత్స్యకారుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

మాయ మాటలు నమ్మకండి

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చే మాయగాళ్లను నమ్మొద్దని, పనిచేసే నాయకులకే ఓటు వేయాలని ప్రజలను కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎనిదేళ్లుగా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలు పెట్టి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఏకై క ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నానని, రేయింబవళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నానన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు పూలతో స్వాగతం పలికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. శంకరమ్మ పేటలో రూ.20 లక్షలతో నిర్మించనున్న జీపీ భవనానికి భూమిపూజ చేసి కంటి వెలుగును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, సర్పంచ్‌లు జగన్, పద్మమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శరత్‌కుమార్‌రెడ్డి, టీఆర్ఎస్ మహిళా విభాగం దేవరకద్ర నియోజకవర్గం అధ్యక్షురాలు జయంతమ్మ, మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, హనుమాన్‌రావు, యాదగిరి, రవీందర్‌రెడ్డి, ఎస్ఈ నరేంద్రకుమార్, డీఈ నరేందర్, ఏడీఏ రామలింగారెడ్డి, ఏఈ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీకి ప్రింటర్ అందజేత



అమరచింత: పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రింటర్ లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా కొత్త ప్రింటర్‌ను గురువారం ఆస్పత్రి సిబ్బందికి అందించారు. డీఎంఆర్ఎం ట్రస్టు చైర్మన్, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాశ్‌రెడ్డి ఆస్పత్రిని సందర్శించిన సమయంలో ఆస్పత్రిలో ప్రింటర్ లేక ఇబ్బందులు కలుగుతున్నాయని సిబ్బంది ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ప్రకాశ్‌రెడ్డి కొత్త ప్రింటర్‌ను ఆస్పత్రికి అందిచారని రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వసంత, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, శివ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కావలి సువర్ణకు నివాళి



వనపర్తి క్రైం: రాష్ట్ర ఆవిర్భావం కోసం కొత్తకోట మండలం మిరాస్‌పల్లికి చెందిన కావలి సువర్ణ ప్రాణత్యాగం చేసిందని వాల్మీకి సంఘం నాయకులు గుర్తు చేసుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కన్వీనర్ దేవన్ననాయుడు మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భావం అయితే తమను ఎస్టీ జాబితాలో చేరుస్తారని నలుగురు ఆత్మబలిదానాలు చేసుకున్నాన్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి వాల్మీకిలను ఎస్టీజాబితాలో చేర్చాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని వీరాయిపల్లిలో రైతు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఎంపీపీ మేఘారెడ్డి, ఎస్ఐ హరిప్రసాద్ ఆవిష్కరించారు. రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న తమ సంఘానికి మంచి గుర్తింపు ఉందని, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి జిల్లాలో సాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నారని, జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా మంత్రి కృషి చేస్తున్నారన్నారని ఎంపీపీ మేఘారెడ్డి అన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి



మదనాపురం: హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని మండలంలోని దంతనూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వనపర్తి డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ మట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కేంద్రం, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, వేమన్న, సత్యశీలా రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజాద్ అలీ, రంజిత్‌కుమార్, వడ్డె కృష్ణ, ఆవుల రాఘవేంద్ర, శేఖర్ రెడ్డి, మహేష్, వడ్డె బాలస్వామి, కావలి అశోక్ కుమార్, ఖాజామైనోద్దీన్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి



పాన్‌గల్: బడిబయటి ఉన్న ఇద్దరు విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించినట్లు సీఆర్పీలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాయినిపల్లిలో చిట్టి, బుసిరెడ్డిపల్లిలో శివ ను వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించారు. చదువుకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, చదువుకుంటే కలిగే లాభాలను వారి తల్లిదండ్రులకు వివరించినట్లు సీఆర్పీలు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి, ఐఈఆర్పీలు సంతోష్, నరేందర్ పాల్గొన్నారు.

నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వాలి: ఎమ్మెల్యే


గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద నీటి లభ్యతపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

వీపనగండ్ల: రామన్‌పాడు జలాశయం నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు అందుతున్న నీటి లభ్యతపై గురువారం ఇరిగేషన్ అధికారులతో గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వివరాలు సేకరించారు. రిజర్వాయర్ నుంచి వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు సాగునీరు అందాల్సి ఉండగా 5 రోజులుగా చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందాలంటే రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండిన తరువాతనే వారబంది పద్ధతిలో నీటిని వదలాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రామన్‌పాడు రిజర్వాయర్ నుంచి నీటిని వదులుతున్న గేజీని పెంచాలని ఉన్నతాధికారులకు ఆయన ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీలు కమలేశ్వర్‌రావు, సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీలు మాధురి, వెంకట్రామమ్మ, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, రైతుబంధు సమితి అధ్యక్షులు కృష్ణయ్య, సురేశ్‌రెడ్డి, ముంత మల్లయ్యయాదవ్, ఇరిగేషన్ ఈఈ జగన్మోహన్‌రెడ్డి, డీఈలు భవాని, శ్రీనివాసులు, జేఈ ప్రభు, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ పలువురు రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నిబంధనలు పాటించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కతలప్ప

వీపనగండ్ల: విద్యార్థులు విద్యలో రాణించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని, ఈ పథకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. గురువారం గోవర్ధనగిరిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు సమయానుకూలంగా పాఠశాలలకు రావడం లేదని, తరగతి గదిలో మొబైల్ ఫోన్లను వినియోగిస్తూ విద్యార్థులకు సక్రమంగా విద్యాబోధన చేయడం లేదని పలువురు గ్రామస్థులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. విద్యా బోధన విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీఓ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆంజనేయులును హెచ్చరించారు. కార్యక్రమంలో సురేశ్‌రెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి


గోపాల్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన కొరిగెల గోపాల్ ముదిరాజ్ ఎంపికయ్యారు. గత నెల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి సీఎస్‌రావు, ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ తనను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారని గోపాల్ తెలిపారు. గురువారం తనకు అధికారికంగా ఐడీకార్డును అందజేశారని చెప్పారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతు వినియోగదారులు తమ బాధ్యతలు, హక్కుల తెలుసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను విస్మరించకుండా నమ్మకంతో విధులు నిర్వహిస్తామన్నారు.

యోగి వేమన జయంతిని అధికారికంగా జరపాలి

వనపర్తి క్రైం: సమాజంలోని రుగ్మతలను చీల్చి చెండాడిన కవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి గోకం వంశీ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. గురువారం వారు జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అలతి పదాల పద్యాలతో అనంత అర్థం ఉందన్నారు. వేమన తెలియని వ్యక్తులు ఉండరని తెలిపారు. ఆంగ్ల ప్రభువు బ్రౌన్ దొర గుర్తించినా మనం వెనుకబడే ఉండటం దురదృష్టకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాల తొలగింపు


డబ్బాలను తొలగిస్తున్న సిబ్బంది

అమరచింత: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలను మున్సిపల్ కార్మికులతో తొలగించామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు జాతీయ నాయకుల విగ్రహాల వద్ద అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ అంతరాయం కలగడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని కమిషనర్ తెలిపారు. ప్రజల ద్వారా వచ్చిన ఫిర్యాదులతో గురువారం ముందస్తుగా బస్టాండ్‌కు ఎదుట ఏర్పాటు చేసుకున్న డబ్బాలతో పాటు తడకల షెడ్లను తొలగించామన్నారు. మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా ఎవరైన ప్రభుత్వం స్థలాలను అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు

కోడేరు: విద్యార్థుల భవిష్యత్‌కు దశ, దిశను నిర్దేశించేది పదో తరగతి. ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే అంత సులువు కాదు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి ముందుకు సాగుతున్నారు. ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండడంతో వాటిని దృష్టిలో ఉంచుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాఠశాల సమయం కంటే గంట ముందే హాజరవుతున్నారు. మండల కేంద్రంతో పాటు కోడేరు మోడల్ స్కూల్, కస్తూర్బా, గురుకుల, రాజాపూర్, ఎత్తం, మైలారం, కొండ్రావుపల్లి, నర్సాయిపల్లి పాఠశాలలో 341మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి ప్రతి పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

రెండు నెలలుగా..

మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ఆయా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రెండు నెలలుగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8:30 గంటల నుంచి 9:30గంటల వరకు, సాయంత్రం పాఠశాల ముగిశాక 4:30 గంటల నుంచి 5:30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

స్వయం ఉపాధి శిక్షణ ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాల కోసం జనశిక్షణ సంస్థాన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శశికళ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జనశిక్షణ సంస్థాన్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కేంద్రంలో నిరుద్యోగులకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధికి బంగారు బాట వేసేందుకు జనశిక్షణ సంస్థాన్ ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన వైద్యురాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా డాక్టర్ అపర్ణ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీలో జడ్చర్ల అర్బన్ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న డాక్టర్ శివకాంత్‌ను అడ్డాకుల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా కేటాయించగా ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. మళ్లీ ఆయనను డిప్యూటేషన్‌పై జడ్చర్ల అర్బన్ హెల్త్ సెంటర్‌కు పంపించారు. ఆయన స్థానంలో గండీడ్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణను అడ్డాకులకు డిప్యూటేషన్‌పై కేటాయించారు. దీంతో బుధవారం ఆమె విధుల్లో చేరినట్లు సీహెచ్ఓ భాస్కర్ తెలిపారు.

అంధత్వం లేని సమాజం నిర్మిద్దాం


వీరాయిపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి


సింగంపేటలో డీపీఓ సురేష్‌కుమార్

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కొండల్‌రావు అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా కంటివెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్లు రమేష్, వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్లు సుఖేశిని, గాయత్రి, కరుణశ్రీ, డీపీఓ సురేష్ కుమార్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, ఎంపీపీలు కృష్ణానాయక్, చుక్క మాలతి, మేఘారెడ్డి, మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, గుంత మౌనిక, ఆవుల శైలజ, గాయత్రి, బంగారు శ్రీనివాసులు, కమలేశ్వర్‌రావు, సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యులు మాధురి, శివరంజని, లక్ష్మి, సామ్యానాయక్, మార్క సరోజ, పద్మ, రఘుపతిరెడ్డి, రాజేంద్రప్రసాద్ యాదవ్, వెంకటరమణమ్మ, ఎంపీడీఓలు అఫ్జల్, ప్రవీణ్‌కుమార్, ప్రసన్నకుమారి, నాగేశ్వర్‌రెడ్డి, కతలప్ప, విజయ్‌కుమార్, జ్యోతి, తహసీల్దార్‌లు ఏసయ్య, సంధ్య, అబ్రహం లింకన్, భానుప్రకాష్, పాండు నాయక్, చాంద్ పాషా, ఎస్‌లు వెంకటేష్‌గౌడ్, హరిప్రసాద్, మండల వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, సౌజన్యలత, దీపిక, ఇస్మాయిల్, మంజుల, రాకేష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, ప్రోగ్రాం అధికారి సౌభాగ్యలక్ష్మి, రాముడు, నిహారిక, హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్వేత, ముజఫర్, రతన్ కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో..


వెనికితండాలో..


అన్నారంలో..

లింగారెడ్డి సేవలు మరువలేనివి


ఈర్లదిన్నెలో లింగారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: నిరంతరం ప్రభుత్వంతో పోరాడి జూరాల ముంపు గ్రామల ప్రజలకు పరిహారం ఇప్పించడంలో స్వర్గీయ చుక్క లింగారెడ్డి సేవలు చిరస్మరణీయమని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో గురువారం చుక్క లింగారెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో రూ.1.20కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చుక్క లింగారెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి మనస్సుతో పాటు క్రమశిక్షణ కలిగిన ప్రజానాయకుడిగా ఈప్రాంత ప్రజల హృదయంలో లింగారెడ్డి నేటికీ పదిలంగా ఉన్నారన్నారు. ముంపు ప్రాంతాల గ్రామాలకు అన్ని వసతులతో కాలనీలు ఏర్పాటు చేయాలని బడి, గుడితో పాటు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించే వరకు ప్రజల వెంటనే ఉంటూ పోరాడిన నాయకుడిగా ఇక్కడి ప్రజల మనస్సులను గెలిచారన్నారు. అనంతరం చుక్కవారి, మొరెడ్డి వారి వంశ వృక్షం పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. లింగారెడ్డి విగ్రహ ఆవిష్కరణకు హాజరైన మహిళలకు చుక్క ఆశిరెడ్డి, లక్ష్మమ్మ దంపతులు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి, జెడ్పీటీసీ మార్క సరోజ, రాజేందర్ సింగ్, రమేష్ ముదిరాజ్, సర్వారెడ్డి, వెంకట్‌రెడ్డి, భూషణంగౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరిచూపు బీఆర్ఎస్ వైపు

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా అందరిచూపు బీఆర్ఎస్ వైపు ఉందని, ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అమలు కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, కౌన్సిలర్ చెన్నయ్య ఆధ్వర్యంలో ఆయాపార్టీలకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఖమ్మం సభతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖంగుతిన్నాయని, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించనుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారుశ్రీనివాసులు, జడ్పీటీసీ శివరంజని, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, విండోఅధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్డు

పెద్దకొత్తపల్లి: మారేడుమాందిన్నె బీటి రోడ్డు అధ్వానంగా మారడంతో ఈ రోడ్డు పై ప్రయాణం చేసేవారికి అవస్థలు తప్పడం లేదు. సాతాపూర్ క్రాస్ రోడ్డు నుంచి యాపట్ల క్రాస్ రోడ్డు వరకు 5 కి.మీ.ల బీటీ రోడ్డు గుంతలమయమైంది. ఈ రోడ్డు పై అచ్చంపేట నుంచి ఆర్టీసీ బస్సులు ఉదయం, సాయంత్రం తిరుగుతాయి. రోడ్డు గుంతలమయం కావడం వలన డ్రైవర్‌లు ఈ రూట్ బస్సు నడపడానికి జంకుతున్నారు. 2010లో ప్రధానమంత్రి సడక్ యోజన కింద రూ.కోటితో చేపట్టిన రోడ్డు అంతా వర్షానికి కొట్టుకుపోయింది. రోడ్డు మరమ్మతు చేపట్టకపోవడంతో యాపట్ల, సాతాపూర్, మారేడుమాందిన్నె, వేడుకరావుపల్లి, తిరునాంపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

పెద్దకొత్తపల్లి: పోలీస్ నియామకంలో అవకతవకలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని విడనాడి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. అరెస్టయిన వారిలో రామస్వామి, ఆనంద్, చెన్నయ్య, వెంకటయ్య, శివ ఉన్నారు.

కొల్లాపూర్: కాంగ్రెస్ నాయకులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షల్లో అవకతవకలను నిరసిస్తూ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టడంతో ముందస్తుగా కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో పట్టణ అధ్యక్షుడు కాంతారావు, బాబా, కురుమయ్య, మౌలాలి, శివానందం తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కులు పరిరక్షించాలి



వీపనగండ్ల: కార్మికుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజలు, రైతుల పక్షాన ఎన్నో పోరాటాలు నిర్వహించామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల ఆశన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. కనీస వేతనాలకు నోచుకోకుండా లక్షలాది మంది అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నారని, వారి శ్రమకు తగ్గ వేతనాలను ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డును ఇచ్చి ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్ వసతిని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, బత్తుల రాములు, రామన్‌గౌడ్, కృష్ణ, రాజు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.